# కాశీ ప్రయాణం

ఎంత కాలానికి అయితేనేం, జీవితంలోని ఉన్నతమైన కోర్కె నెరవేరే సమయం వొచ్చింది. భూలోక స్వర్గ మనబడే కాశీకి ప్రయాణం చేయడం కంటే, పవిత్ర గంగానదీ జలంలో స్నానం చేయడంకంటే, జగన్నాటక సూత్రధారుడైన విశ్వనాథునీ, అన్నపూర్ణాదేవినీ దర్శించడంకంటే—భక్తిపరుడైన హిందువునకు జీవితంలో గొప్ప ఏమున్నది? అది మోక్షాన్ని పొందడం కంటె తక్కువైంది కాదు. ఆ ప్రయాణాన్ని ఇప్పుడు పెట్టుకున్నాం నేనూ, నా భార్యా. ఈ శుభ ముహూర్తం కోసం దాంపత్య జీవితంలో మేము ప్రవేశించిన దగ్గర్నుంచీ—అంటే యాభై ఏళ్ళనుంచీ ఎదురు చూస్తున్నాం. కానీ కాశీ వెళ్ళటమంటే మాటలతోపనికాదు; పదిహేనువందల మైళ్ళ ప్రయాణం-ఎంతో డబ్బు కావాలి. ఒక పేద పల్లెటూరి ఉపాధ్యాయునిగా, రు. 15—½—20 స్కేలుగల ఉద్యోగంతో పొట్ట నింపుకోనేందుకే కష్టమైన స్థితిలో జీవితమంతా గడిచింది. అక్కడికీ చిరిగిన దుస్తులు ధరించబట్టే—రోజులు దొర్లాయి. కాబట్టి నేను ఏం కూడబెట్ట గలిగేది? కాశీ వెళ్ళే అవకాశాన్ని గూర్చి నేను తలచనైనా లేదు. కాని ఆ రోజు రాత్రి నిద్రపోయేముందు మా ముసలిది చిల్లర డబ్బుతో నిండిన మట్టికుండ నా ముందు తెచ్చిపెడితే—నా ఆశ్చర్యాన్ని గురించి ఏమంటారు? పొంగి వచ్చే ఆనందం ప్రాణాల్ని పైకి ఎగరగొట్టేసి నట్లయింది.

"ఎట్లా...ఎట్లా..." నా గొంతు వొణికి, మాట ద్రొర్లి రాలేదు.

"అప్పుడప్పుడూ అణా, బేడా, పావలా మిగిల్చి అందులో వేస్తూంటే...మనం కాశీ పోవాలని అనుకున్నాంగా!" అన్నది మా ఆవిడ.

"కాశీ! నీ కేమన్నా పిచ్చి పట్టుకుందా!...మనకు ఎంత డబ్బు కావాలో....రైలు ఖర్చులే పోవటానికీ, రావటానికీ నూటడెబ్భై రూపాయలు అవుతాయి."

"కాశీ విశ్వనాథుని కరుణే ఉంటే అంత డబ్బూ మనదగ్గర ఉండొచ్చు. ఏమైనా, మనం ఇంకా ఎక్కువకాలం బ్రతికేది లేదు; ఎక్కువ వెనక వేసేది కూడా ఏమీ ఉండదు." అన్న దావిడ ప్రశాంతంగా.

నేనేం మాట్లాడలేదు. లెక్కపెట్టే ఆదుర్దాలో ఉన్నాను. తలుపు మూశాను. మడతలో ఉన్న పాత చీరెను ఆవిడ ఈతాకుల చాపమీద పరచి, కోడిగుడ్డు లాంతరు తీసికొచ్చింది. సాధ్యమైనంత నిశ్శబ్దతతో నేను చీరె మడతలమీద కుండలో ఉన్న చిల్లర డబ్బుల్ని పోశాను. కొన్ని రాగి నాణెములకు చిలుము పట్టింది. మేం ఆ చిలుమును చీరెతో తుడిచి, లెక్కించాము. రూపాయల కుప్పలు మా ముందు నిలిచాయి. నిండు చంద్రుడు సరిగ్గా నెత్తిమీద కొచ్చాడు. లెక్క ప్రారంభించేప్పటికి, "ఒకటి, రెండు, మూడు..." ముందుకు వెళ్ళినకొద్దీ గుండెలో దడ ఎక్కువ కాజొచ్చింది. "నూట అరవై, ఒకటి, రెండు...డెబ్భై, నూటడెబ్భై. ఇదంతా మాయ. భగవంతుని లీలా విలాసం! నూటడెబ్భై ఒకటి, రెండు, మూడు, నాలుగు-ఏడు! మొత్తం నూట డెబ్భై ఏడు!" పెద్దగా అరిచాను. నా ఆనందానికి

మేర లేకపోయింది. ఎగిరి గంతేశాను. మా ఆవిడ అగాధ నేత్రాలలో ఆనందబాష్పాలు గుమి గూడినయ్. ఈ ఆడవాళ్ళు—నిజంగా, ఎంత మంచివాళ్ళు?

మేం వెంటనే ఆ ధనాన్ని ఆ మట్టికుండలోనే పెట్టి గోడ లోనే పాతిపెట్టాం. మేము విశ్రాంతిగా పడుకున్నాం. నిద్ర పోయేందుకు కాదు—ప్లాను వేసేందుకు. మా కోర్కెలస్వర్గం—కాశీ, చేరేందుకు సరిపడే డబ్బు ఉన్నది. కాని రైల్వే ఖర్చులకు పోను ఏడు రూపాయలుమటుకు ఉన్నాయి. ఈ డబ్బులు-ఈ రోజులలో, పై ఖర్చులకు సరిపోతాయా? కూలివాళ్ళకు ఇవ్వాలి, దారిలో భోజన ఖర్చులు—ఓరి భగవంతుడా!—ఉండటానికి వసతి గృహానికి కూడా చెల్లించాలి కాబోలు! ఏమి చేయగలం? సంతోషపు శిఖరాల నుండి దుఃఖపు లోతులలోకి దిగిపోయాం. ఆలోచించు కోవడంతో, మా ఆశలు జారిపోయినయ్. ఇంకా ఇరవై కానీ, ముప్పై రూపాయలు కానీ—పై ఖర్చులకు కావాల్సి వొస్తాయి. కాశీ కొత్త ప్రదేశం. అక్కడివాళ్ళంతా కొత్త. వాళ్ళు మాట్లాడేది యీ భాషకాదు—ఇంకా ఏం అవసరాలు వస్తాయో, ఎంత డబ్బు వెచ్చించాల్సి వుంటుందో ఒక నిర్ణయానికి రాజాలక పోయాము. అదీ కాకుండా, ఈ మధ్యనే పత్రికలలో చదివాను—"పండా" అనేవాళ్ళు ఒక యాత్రిక కుటుంబాన్ని దోచుకుని, హత్య చేసినట్టు. నిజంగా అది దారుణమైన కథ. అవును. ఉండేందుకు సురక్షితమైన ప్రదేశమే చూచుకోవాలి. అటువంటి ప్రదేశం దొరకాలంటే డబ్బు ఎక్కువ పెట్టాలి ఈ డబ్బు మాకు ఎక్కడినుంచి వస్తున్నది? ఇది నిజంగా—పెదవి దగ్గరకు వచ్చిన అమృతపాత్ర జారిపోయినటువంటిదే.

ఇంకా మేము ఏమీ కూడబెట్టలేము. వచ్చేనెల పెన్షను కూడా

కిరాణా కొట్టువాడికి, పాలవాడికి ఎప్పుడో తనఖా పెట్టాము. అప్పుతెస్తే? అప్పు మాకు ఎవ్వరిస్తారు? హామీ పెట్టేందుకు ఏమున్నది? ఏమీ లేదు. ఊళ్ళో ఉన్న ప్రజలంతా మాకు తెలుసు. ఉహూ! అది సాధ్యమైన పని కాదు. మమ్మల్ని నిరాశ ఆవరించింది. తలలు నొప్పి పుట్టే వరకూ, తెల్లవారుజామున కోడి కూసేవరకూ ఆలోచించాము. చిట్టచివరకు మా ముసలిది సాహసంతో ఒక నిశ్చయానికి వచ్చింది. చిన్న చిన్న మా వస్తువుల్ని నేనే మోసి కూలివాని చార్జీలను తీసివేయాలని సూచించింది. తరువాత, కొంత బియ్యం ఇంటిదగ్గర్నుంచి తీసికెళ్ళి, దారిలో నీళ్ళు త్రాగుతూ వాటిమీదనే రోజుల్ని గడపాలన్నది. కాని ఆఖరికి ఆమె చేసిన సూచన నాకు గిట్టలేదు. డబ్బంతా కాశీలోనే ఖర్చుపెట్టి, ఇంటికి వెళ్ళకుండా అక్కడే ఉండిపోదా మన్నది. "ఏమిటి నీ ఉద్దేశ్యం? అంత పెద్ద నగరంలో నెలకు వచ్చే 10 రూపాయల పెన్షనుతో ఎట్లా ఉండగలం?" మా ఆవిడ అమాయకత్వానికి నవ్వుతూ అన్నాను. కాని నాదే తప్పు.

"మనం ఉండలేకపోతే—ఆ పవిత్ర స్థలంలోనే ప్రాణాల్ని విడుద్దాం!" ఎంతో గంభీరమైన ఉద్దేశ్యం వ్యక్తమయేటట్టు ప్రశాంతంగా అన్నది. ఆమె గాఢ నిశ్చయానికి ఆశ్చర్యపడ్డాను.

"మనం కాశీ వెళ్ళేదే—మోక్షంకోసం! మనం తిరిగి ఎందుకు రావాలి?" అన్న దావిడ తన నిశ్చయాన్ని సమర్థించుకుంటూ.

నేనేం చెప్పగలను? అంతా నిశ్చయమైంది. బరువెక్కిన అవయవాలతో, కాని తేలికైన హృదయాలతో లేచాము. పవిత్రమైన యాత్రకు బయలుదేరు తున్నామని వూళ్ళో తెలియగానే—వూళ్ళో సంచలనం బయిలుదేరింది. షాన్‌భోగ్ పరుగెత్తుకుంటూ వచ్చి, అడిగాడు: "ఇది నిజమేనా తాతా! మీరు కాశీ

"మన అదృష్టం మీదనే నమ్మకం ఉంచా. అంతకంటె వేరే గత్యంతరం లేదు."

"మా పెదనాన్న కొడుకు అక్కడ హనుమాన్ ఘాట్‌లో ఉంటున్నాడు. అక్కడ వాడు పని చేస్తున్నాడు. వాడికీ నాకూ ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచి చాల సంవత్సరాలైంది. అయినా, వాడికి ఉత్తరం వ్రాస్తాను. మీకు వాడు వసతి చేకూర్చగలడు. మీ కేమైనా అభ్యంతరమా?" అన్నాడు స్టేషను మాస్టరు.

"అభ్యంతరమా? అభ్యంతరం దేనికి? మహారాజులాగ వెళతాం. కాని, వాళ్ళకు మేము కొత్తగా—" సంకోచాన్ని వెల్లడించాను.

"ఫర్వాలేదు. నాకు స్నేహితులుగానే మీరు ఇక్కడినుంచి వెళ్ళుతున్నారు. ఆ మాత్రం స్వతంత్రం నాకు ఉంది వాడి దగ్గర. మీరేం కంగారు పడక్కర్లేదు. మా ఇంటికి వెళదాం రాండి. ఇప్పుడే ఉత్తరం వ్రాద్దాం. వాడి అడ్రసు నా పెట్టెలో ఎక్కడో ఉండాలి."

ఈ తలంచని ఉపకారానికి నా హృదయం ఆనందంతో వూగులాడింది. ఆ ఉత్తరంలో, మా పుణ్యక్షేత్ర ప్రయాణమూ, మేం కాశీ చేరుకొనే రోజూ, వేళా, మమ్మల్ని గురించి సంక్షిప్తంగా వర్ణన—వ్రాశాడు. ఉత్తరం ముగిస్తూ—ఈ ముసలి దంపతులకు అన్ని సౌకర్యాలూ చేకూర్చ వలసిందని ప్రత్యేకంగా వ్రాశాడు స్టేషను మాస్టరు. ఒక కవర్లో ఉత్తరంపెట్టి—పైన "విశ్వేశ్వరరావు" అని వ్రాశాడు. తర్వాత ఆ బంధువు అడ్రసూ, ప్రయాణపు తీరూ, అంతా వ్రాసి నాకు ఇచ్చాడు. ఇదంతా మా ముసలిదానికి చెప్పేసరికి "ఇదంతా ఆ విశ్వనాథుని మహిమే" అన్నది.

"మనం తిరిగి రావొచ్చు" అన్నాను పూర్వపు నిర్ణయాన్ని పురస్కరించుకొని.

"చూద్దాం—అక్కడ ఏం జరుగుతుందో! మనం దేనికైనా సంసిద్ధంగానే ఉన్నాము" అన్నది మెల్లగా.

మేము బయలుదేరే రోజు—జీవితంలో ఎన్నడూ లేనంత ఆదుర్దాగా ఉన్నాం. చిన్న వస్తువుల్ని మూటలుగా కట్టడం, విప్పడం, మళ్ళీ కట్టడం. మొత్తం సామానంతా ఒక పెద్ద పెట్టె నిండా, ఒక దుప్పటితో కట్టిన మూటనిండా ఉన్నది. పెట్టెలో మా గుడ్డలూ, డబ్బూ ఉన్నాయి. ఆ మూటలో బియ్యమూ, రెండు తపేలాలు, నిత్యమూ పూజసలిపే బొమ్మలూ ఉన్నాయి. ఆ రాత్రి మా కళ్ళపైన కునుకు లేదు.

ఆ రోజు ఉదయం త్వరగానే అంతా సర్దాము. షాన్‌భోగ్ మమ్మల్ని భోజనానికి ఆహ్వానించాడు. కిరాణా కొట్టు యజమాని రెండెద్దుల బండిని పంపాడు. మంగలీ, శాస్త్రిగారూ ఆ రోజు తాము చేసిన పనులకు దమ్మిడీ కూడా పుచ్చుకొనేందుకు ఒప్పుకోలేదు. ఊళ్ళో రెండెద్దుల బండి సాగగానే వూరంతా బండి వెంట రోడ్డు మలుపువరకూ కదలి వొచ్చింది మమ్మల్ని సాగనంపేందుకు. స్టేషన్లో మాస్టరుగారు చాల సహాయపడ్డారు. ఆయన టిక్కెట్టు వ్రాసి, చిల్లర డబ్బుల్ని రూపాయలకు మార్చి, పోర్టరుచేత సామానంతా రైలులో పెట్టించి, భోగిలో మంచి చోటు చూపించి—"జాగ్రత్త" అని చెప్పి సెలవు తీసుకున్నాడు.

* * *

మైసూరు వరకూ ప్రయాణం ఎంతో సుఖంగా ఉంది. కాని, ఆ తర్వాత అది ప్రయాణం కాదు. క్షణం క్షణమూ పోట్లాటే!

మూడో తరగతి పెట్టెనిండా జనమే! క్రిక్కిరిసి ఉన్నారు. కొలదిమంది అదృష్టవంతులకు విశాలంగా కూర్చునే చోటు దొరికితే—మిగతావాళ్ళ అవస్థ వర్ణనాతీతం! సామాను పెట్టెలో క్రిందా, పైనా సర్దారు. తలుపులు ఎప్పుడూ బిగించే ఉంటాయి. ప్రతి స్టేషన్లోనూ ప్రయాణీకులు సామానులు బయటినించి విసరి మనుషుల భుజాల మీదకు వేయడం, వాళ్ళు పోట్లాడడం, బ్రతిమాలటం, లోపల్నుంచి సామాను లాగటం, కాళ్ళు నలగటం, తిట్టుకోవటం, బెదిరించుకోవటం, పిల్లల ఏడ్పులు, పెద్ద వాళ్ళ కేకలు—అంతా నానా రభసగా వుంటూ వొచ్చింది.

రాత్రుళ్ళూ, పగళ్ళూ మేము ఒకళ్ళ కొకళ్లం రాచుకొని అట్లానే నిద్ర లేకుండా, తూగుతూ, అలసి, ఆకలితో—అట్లాగే ప్రయాణం చేశాం. స్వర్గానికి మార్గం నరకంనుంచి ఉన్నట్టుగా నాకు తోచింది. బొంబాయిలో మేము వాస్తవంగా లోపలకు పోనివ్వండి అని భిక్ష అడిగినట్టు అడిగాం. బండి ఆ కొసనుంచి యీ కొసకు పెట్టె నెత్తిన పెట్టుకు నేనూ, మూట నడుంకు తగిలించుకుని మా ఆవిడా తిరిగాము. మేం కాశీ పోతున్నాం, కనికరించండి! ముసలివాళ్ళం!" అని ప్రయాణీకుల్ని ప్రార్థించగా, దయగల స్వభావులు దారి యిచ్చి బండి సాగేముందు ఎక్కనిచ్చారు.

కాని, ఈ నానా అవస్థా, పడ్డ శ్రమా, మూడు రోజులు అనుభవించిన నరకమూ—పుణ్యక్షేత్రం సమీపిస్తోందని తెలియగానే ఇట్టేమర్చిపోయాము. బండిఆగగానే మేమంతటికి మేమే క్రిందకు నెట్టివేయబడ్డాము. పునర్జన్మ ఎత్తినట్టుగా--మనసారా వూపిరి పీల్చాను. నాముందు నిలబడ్డ మా ముసలి దాని నేత్రాలు "జీవితంలో గొప్ప విజయాన్ని సాధించినట్టు" మెరిశాయి.

మేం చుట్టూ చూసేప్పటికి, నలుగురు మనుష్యులు ధోవతి ధరించి చుట్టుముట్టారు. వాళ్ళ నుదురులు గంధపు చారలతో, కుంకుమ బొట్టులతో, వాళ్ళ నోళ్ళు 'పాన్'లతో, పెదాల చివర్లు ఎర్రగా—గంభీరంగా ఉన్నారు. చూచేందుకు వాళ్ళు కొత్త భాషలో మాట్లాడుకుంటున్నారు. నన్ను ప్రశ్నించారు. వీళ్ళు యాత్రికుల వెంటబడే "పండా" వాళ్ళని వూహించాను. నేనేం సమాధానం చెప్పలేకపోయాను. కాని, చేతుల ద్వారా మా బంధువులకోసం ఎదురు చూస్తున్నానని తెలుపుదు చేశాను. వాళ్ళు అర్థం చేసుకొనేందుకు ప్రయత్నించినట్టు లేదు. వెంటనే నెట్టుకుంటూ మీదకు వొచ్చారు. ఒకతను నా తలమీద నున్న పెట్టెను లాక్కున్నారు. మరొకతను మా ఆవిడ దగ్గర ఉన్న మూటను లాక్కుని, మా భాషలో ఆమె ఏడ్పునీ, ప్రార్థనలను వినిపించుకోకుండా పరుగెత్తిబోయినాడు.

నేను చప్పట్లు చరిచి, అరిచాను. కాని ఏం లాభం? మేము ఇట్లాంటి దురవస్థలో ఉండగా ఒక యువకుడు "పండా" వాళ్ళని నెట్టుకుంటూ వొచ్చి, వాళ్ళ భాషలో తిడుతూ, ఆ మూటను లాక్కున్నాడు. మేం ఎదురు చూసేది ఆ మహాను భావుని కోసమే కామోసు ననిపించింది. నేను అడిగాను, "మీరు విశ్వేశ్వరరావుగారని నేను అనుకుంటున్నాను. తమ బంధువు మా రాకను తెలియజేస్తూ వ్రాసిన లేఖ సకాలంలోనే అంది నదా?" అతను సూటిగా ఏం సమాధానం చెప్పలేదు. మా ముసలిదాని వంక చూస్తూ, నా వైపుకు తిరిగి—"అయితే, మీరు మైసూరునుంచి వొస్తున్నారన్న మాట?" అన్నాడు. మా భాషలో ఆ వాక్యం ఎంతో మధురంగా వినిపించింది.

"అవునండీ! అవును. బదన్‌వాల్‌కు దరిదాపులోనే మా

వూరు" అన్నాను. ఆవేశమూ. ఆనందమూ వెల్లివిరిసే స్వరంతో

"ఉహూ—"

"ఆయన మాకు ఎంతో సహాయపడ్డారు—మీ పొత్తు కల్పించి. లేకుంటే మా అవస్థ ఆ పరమాత్మునికే ఎరుక. చూశారుగా!"

"ఓ" సన్నగా చిరునవ్వు నవ్వాడు.

"అంతా కులాసాయేనా?" అన్నాను యోగక్షేమాలు విచారించే దృష్టితో.

"ఆ!......మిమ్మల్ని గురించి నేను అడిగి వుండాల్సింది. క్షమించండి! ప్రయాణం సుకరంగా జరిగిపోయిందా?"

"ఏదో...అట్లా...అట్లా."

"ఈ రోజులలో రైలులో ప్రయాణం ఘోరం! అర్థం లేదు నేను అడగటంలో—"

"అంతా అట్లా కాదనుకోండి...మీ అన్నగారు మీకు ధన్యవాదాలు చెప్పమన్నారు."

"ఏమిటి!...ఓ...వాడా! మంచిది. అంతా కుశలమేనా? వాడి భార్య..."

"మీకు ఇంకా తెలీదా? అతని భార్య చనిపోయి చాలకాలమైంది!"

"చనిపోయిందా? అతను నాకు ఆ విషయం వ్రాయనే లేదు."

"ఎంత ఆశ్చర్యం? ఏమైనా ఆయన పిల్లలు కూతురూ, కొడుకూ—మీకు తెలుసు ననుకుంటాను?"

"అవును...వాళ్ళు బాగున్నారుగా!"

"ఊ! బాగా పెరిగి పెద్ద వాళ్ళయినారు."

"నేనూ అట్లానే అనుకున్నాను. మా ఇద్దరిమధ్యా ఉత్తర ప్రత్యుత్తరాలు చాల తక్కువ, దూరం కావడంచేత..."

"అవును. మీ అన్నగారు కూడా ఖచ్చితంగా అట్లానే అన్నారు; కంటికి కనిపిస్తాంటేనే—మంచి చెడ్డలు తెలుస్తాం లేది!"

"నిజం అంతే!"

"బయల్దేరదామా? వెళుతూ మాట్లాడుకోవచ్చు."

"అలాగే......ఆలాగే......బండిలోని సామానంతా దించాలా?" అనుమానంగా అన్నాడు.

పెట్టె, మూటయే మాకుగల సామాను అని చెప్పగా, అతను పెట్టెదగ్గరకు వొచ్చి "ప్రయాణ బడలికలో తమరు ఉన్నారు. నేను తీసికొస్తాను" అన్నాడు. నేను వొద్దని బ్రతిమాలినా అతను వినిపించుకోలేదు.

స్టేషన్నుంచి బయటి కొచ్చేప్పుడు, అతను పార్సిల్ ఆఫీసులోకి వెళ్ళి—ఒక కొయ్యపెట్టెను కూలివాని నెత్తికి ఎక్కించి బయటి కొచ్చాడు. ఒక టాంగా మాట్లాడి, మమ్మల్ని అందులో ఎక్కించి—తాను సైకిలుమీదే మా వెంటే వొచ్చాడు. టాంగా పెద్ద పెద్ద బజార్లోంచి వెళ్ళి తర్వాత సన్నటి గొందుల్లోంచి వెళ్ళి చివరకు రెండు అంతస్థుల మేడముందు నిలబడింది. అప్పటికే అతను సైకిలుమీద ఇంటికి ముందుగా వెళ్ళాడు. బండి ఆగగానే, మేడమెట్లు దిగి వొచ్చాడు మాకు సహాయం చేయడానికి. మా వస్తువుల్ని క్రిందకు దించి, టాంగావాలాను పెట్టెను లోపలకు తీసికొనిరమ్మని చెప్పి—మమ్మల్ని లోపలకు తీసికెళ్ళాడు. అతను టాంగావాలాకు మూడు రూపాయలు బాడుగక్రింద చెల్లిస్తూంటే గుడు అప్పజెప్పి చూస్తూ వూరుకోవటం తప్ప ఏం చేయలేక పోయాను. మేం ఇంట్లో ప్రవేశించగానే—అతనిభార్య వొచ్చింది మనసారా మమ్మల్ని ఆహ్వానించేందుకు.

"వీరే మన తాతాగారు, అమ్మమ్మగారు" పరిచయం చేశాడు.

"మీరు మా ఇంటికి రావడం మాకెంతో సంతోషం" అన్నదామె.

తలుపుచెక్కమీద నంబరు చూడగానే—"మీరు ఇల్లు మార్చినట్టు అగుపడుతూంది. నాకు ఇచ్చిన నంబరు వేరు" అన్నాను.

"అవును కొన్నాళ్ళక్రితం ఇల్లు మార్చాము" అన్నాడు అతడు.

మేం ప్రవేశించిన హాలు చిన్నదే కాని పరిశుభ్రంగా ఉంది. గోడలమీద కొన్ని ఫోటోలు; చిత్రాలు ఉన్నాయి గాని—మేము ఆరాధించే దేవుళ్ళవి కావు. గోడల ప్రక్కన ఆరు అరమరలనిండా పుస్తకాలు నింపి ఉన్నాయి. నేలమీద అందమైన తివాచీ పరచి ఉంది. ఒక ముక్కాలు పీటమీద వీణ పెట్టి ఉన్నది. నేల ముగ్గులతో అలంకరించి లేదు. ద్వారబంధాలు మామిడాకు తోరణాలతో శోభాయమానంగా లేవు. మండిగములు పసుపూ, కుంకుమలతో కళకళ లాడుతూ లేవు. వీళ్లు పూర్వాచారాల్నుంచి తప్పించుకున్నవాళ్లుగా నాకు అగుపించారు.

"మీరు సుఖంగా విశ్రాంతి తీసుకోండి, ప్రయాణ బడలికలో వుండివుంటారు. ఇప్పుడే వస్తాను. పొయ్యిమీద కూర కాగిపోతోంది..." అంటూ ఆమె వంటగదిలోకి వెళ్లింది. ఆమె మాటలలో ఎంతో అప్యాయత, మృధుమధురత గోచరించింది.

అతను మమ్మల్ని మంచిచెడ్డలు అడుగుతూ మా వూరి విషయాల్ని విచారిస్తూ—కాశీనిగురించి చెబుతూంటే, ఆమె ఇంట్లో అటూయిటూ తిరుగుతూ - మా సంభాషణలో అప్పుడప్పుడూ పాలు పంచుకుంటూంది. అయిదు నిమిషాల తర్వాత-ఆమె చల్లని

పానీయం తీసికొచ్చింది. వాతావరణం వేడిలోకి మారుతున్న కొద్దీ—నాకు దప్పిక ఎక్కువ కానారంభించింది.

"ఈ పానీయం గంగాతీర్థంనుంచి తయారుచేయబడిందేనా ?" అన్నాను త్రాగాక. అవు నన్నట్టు అతను తల ఆడించగా—ఆశ్చర్యంతో రెప్ప లార్చాను. మా ఆవిడ స్నానం చేశాక త్రాగు తానన్నది.

"స్నానానికి వేడినీళ్లు పెట్టాను" ఆహ్వానించిం దామె. మాకు వేడినీళ్లు స్నానానికి అవసరం లేకపోయినా—వద్దని అనలేదు. పరిశుభ్రంగా స్నానం ముగించాక, లేడి చర్మంలో భద్రంగా చుట్టిన బొమ్మల్ని తీసి — "మీ పూజామందిరం ఎక్కడ ?" అన్నాను.

"మాకు పూజామందిరం అంటూ ఏమీ లేదు." అన్నాడు చిన్నగా నవ్వుతూ, సిగ్గుపడుతూ అతను. నేను సంభ్రమాశ్చర్యాలనుంచి తేరుకోనకముందే—

"కాని పూజామందిరాన్ని అప్పటికప్పుడే ఏర్పాటు చేసుకోవొచ్చు" అంటూ, అతనూ, అతనిభార్యా ఒక చిన్న గదినించి సామాన్లు తొలగించి, శుచిగా కడిగారు. నాకు ఏదో నామూషిగా తోచినా, వాళ్ళ ఏర్పాటు నాకు ఎంతో నచ్చింది. అదే మొదలు. తర్వాత రోజుల్లో కూడా వాళ్ళు పూజా పునస్కారాలు ఏమీ చేసే అలవాటు ఉన్నట్లు అగుపించక కొంచెము బాధ పడ్డాను. కాని మా విషయంలో, మేం నిత్య అనుష్ఠాన కర్మలు ఆచరించేవిషయంలో వాళ్లుచూపిన శ్రద్ధ, చేసినఏర్పాట్లు, ఉపకారం—మమ్మల్ని తలక్రిందులు చేసినయ్. పరిస్థితుల్ని అంత త్వరితగతిలో మార్చేవారు మా అవసరాలకొరకు, సంతాన విహీనులమైన మేము, వాళ్లిద్దరిలో ఎంతో ఆత్మీయత,

పూజ్యభావం, మమ్మల్ని సంతోషపెట్టేందుకు శ్రమపడటం— చూశాం.

స్నానంచేసి వొస్తూ—అతను కొన్ని అరటాకులతో ఇంట్లోకి ప్రవేశిస్తూండటం గమనించాను. మేం పళ్ళేలలో భోంచేయమని తెలుసుకొని, వెంటనే షాపుకు అతను పరుగెత్తాడు ఎండలో. మాకు వెంటనే భోజనం వడ్డించబడింది. మేము భోంచేస్తూన్నంతసేపూ, ఆమె విసనకర్రతో విసురుతూనే ఉన్నది, వేడి భోజనపదార్థాలు చల్లబడేందుకు. నేను ఇంకా ఆలస్యంగా ముగించవలసినవాణ్ణే కాని అతను నాకంటే ఎంతోముందుగా భోజనం ముగించి—చివరిభాగంలో నాతోపాటు లేచేందుకు అతి నెమ్మదిగా తింటున్నాడు. భోంచేసి లేవగానే బయట నీళ్ళూ, సబ్బూ రెడీగా ఉన్నాయి. హాలులో తమలపాకులూ, వక్కపొడి రజత పాత్రలో పెట్టి ఉన్నాయి. మేం తమలపాకులు నములుతున్నప్పుడు, అతను తన కా అలవాటు లేదని చెప్పి—ప్రక్కగదిలో మాకు పక్కలు ఏర్పాటు చేస్తున్నాడు. మేము ఏకాంతంగా గదిలో విడిచిపెట్టబడినప్పుడు మా ఆవిడ నన్ను తట్టి—"మీరు ఎప్పుడైనా ఇట్లాంటి భోజనం రుచి చూశారా?" అన్నది.

"చ్చ" అన్నట్టు తల ఆడించాను.

"ఆమె వంటలో ఎంత ప్రావీణ్యురాలో చూడండి"

"ఎంత సహృదయురాలు"

"మంచి దంపతులు, భగవంతుడు శుభాశీస్సులు చేకూర్చుగాత!"

పెద్ద మంచాలపైని అందమైన, మెత్తని, తెల్లని పరుపులను చూపించి, విశ్రాంతి తీసుకోండి అని చెప్పినప్పుడు—మేం తిరస్కరించాము. నా జీవితంలో ఈత ఆకుల చాపమీద తప్ప పడు

కొని ఎరుగనని చెప్పాను. కాని అతను ససేమిరా అన్నాడు. ఇంతలో ఆమె కూడా అందుకుంది. మేం కాదని గట్టిగా అనలేకపోయాము. అతను ఫ్యాన్ ఆన్ చేసి, తలుపులు మూసి వెళ్ళాడు.

"వీళ్లతో మనం ఎట్లా మెలగడం?" అన్నాను మా ఆవిడతో.

"ఏమో" అని పెదవి విరచింది మా ముసలిది.

కొలది నిమిషాలకే మేము నిద్రాదేవికి దాసోహం అన్నాము. నేను నిద్రనుంచి లేచేటప్పటికి చీకటి పడింది. హాలులోనుంచి మధురమైన వీణాస్వరాలు వినిపిస్తున్నాయి. నేను గదినుంచి బయటికొచ్చేటప్పటికి తెల్లని చీరె ధరించి ఆమె అపర సరస్వతీ దేవిలాగ వీణ వాయిస్తోంది. ఆమె చెంతనే కూర్చుని మైమరపులో మధుర గానాన్ని ఆలకిస్తున్నాడు అతను. పురందరదాసు భక్తిగీతం ఆమె ఆలపించేటప్పటికి నన్ను నేను మర్చిపోయినాను. తర్వాత ఆమె ఫ్లాస్క్ తెచ్చి, కప్పులో వేడి కాఫీ పోసి నాకు యిచ్చింది. నేను మా ఆవిడవంక చూసేటప్పటికి ఆవిడ అప్పుడే కప్పు ఖాళీచేసి అక్కడ పెట్టింది. ఆమె మళ్ళీ కూర్చొని కొన్ని చక్కని పాటలు వినిపించింది. ఆ పైన కమ్మని భోజనం, కొన్ని పండ్లు, వేడి పాలు, తమలపాకులూ, వక్కపొడి, తెల్లని పరుపుగల మంచమూ—ఆరోజు పూర్తి అయింది.

మరునాడు ఉదయం అతను మమ్మల్ని గంగానదీ తీర స్నాన ఘట్టాలలో అన్నిటికంటె పవిత్రమైన మణికర్ణిక స్నాన ఘట్టానికి తీసికెళ్లాడు. ఆ స్నానఘట్టం యాత్రికులతో మహా గందరగోళంగా ఉన్నది. క్షురకర్మ, స్నానమాడటం, దుస్తులు ధరించడం, కబుర్లు చెప్పుకోవడం, పూజ సల్పడం, పోట్లాడుకోవడం, ప్రార్థనలు జరపడం — అన్నీ ఏకకాలంలో అక్కడ జరుగు

తున్నాయి. 'పాండా' వాళ్లు మమ్మల్ని చుట్టు ముట్టేందుకు ప్రయత్నించారు. కాని అతడు వాళ్లని పారద్రోలాడు. మేము హాయిగా స్నానం చేశాము. మేము స్నానం చేస్తున్నంత సేపూ మెట్లమీద కూర్చొని మా దుస్తులకు కావలి కాశాడు అతను.

"మీరు స్నానంచేయరా?" అన్నాను.

"ఉహూ! ఇప్పుడే కాదు. నేను ఇంటిదగ్గరే స్నానం ముగించి వచ్చాను. అప్పుడప్పుడూ నేను మైసూరు స్నాన ఘట్టం దగ్గరే మునుగుతూ వుండటం కద్దు."

నాకు వచ్చిన మంత్రాలు పఠించి 'పాండా' దగ్గర కానీ పసుపూ, గంధపుపొడీ తెచ్చి స్నానం ముగించాను. తర్వాత అతని వెంటే సన్నని వీధులలోగుండా రకరకాలైన దుకాణా లను చూస్తూ, యాత్రికుల్ని, వీధులలో తిరిగే ఆవుల్ని తప్పించు కొని చిన్న ఎర్రటి కట్టడం దగ్గరకు చేరుకున్నాం. దానికి చిన్న గోపురం, ఆ గోపురంపైన బంగారు శిఖరం ఉన్నది. 'పాండా' వాళ్లు అక్కడకూడా మమ్మల్ని వెంబడించారు కానీ, అతను కసురుకోవడంతో తమ దోవను తాము వెళ్లారు. ఆ కట్టడాన్ని సమీపించడంతో—"ఇదే విశ్వనాథుని దేవాలయం" అన్నాడు అతను.

అయితే వొచ్చామన్నమాట. ఎట్లాగైతేనేం ప్రపంచ విఖ్యాతమైన, భూలోక స్వర్గమని శ్లాఘించబడే విశ్వనాథుని దేవాలయానికి చేరుకున్నాం. ఆనందపారవశ్యంతో నా హృద యం అల్లల్లాడ నారంభించింది. ముసలిదాని కళ్లు తడి అయి నాయి. నేను కొన్ని పువ్వులూ, ఫలాలూ, పటికబెల్లమూ, అగరవత్తులూ, పసుపూ, కుంకుమా - కర్పూరమూ - మొద లయిన పూజకు పనికివచ్చే వస్తువులు దగ్గరవున్న షాపులో

కొన్నాను. వెండి పూతతో మెరుస్తోన్న ద్వారంలోంచి దేవాలయంలోకి ప్రవేశించాము. ఒక చిన్న గదిలోకి చేరుకున్నాం. ఆ గదినిండా ఒక్కటే యాత్రికుల సందడి. అతను లేకపోతే ఎంతసేపటికి మాకు స్వామి దర్శనమయ్యేదో ఊహించలేము. అతను అంత జనంలోంచి ఒక దారి చేసి ఆ దారిలో మమ్మల్ని ముందుకు నెట్టాడు. చిన్న కోనేరువద్ద పూజ సల్పాము. అక్కణ్ణుంచి చూస్తే విశ్వనాథుని విగ్రహం అగుపడుతుంది. విశ్వనాథుని మనసారా దర్శనం చేసుకుని, పవిత్ర జలాన్ని, పుష్పములనూ తీసికొని బయటికొచ్చాము. బయటి కొచ్చేటప్పటికి స్వేదంతో స్నానం చేసినట్లయింది. కాని ఇదేమి మమ్మల్ని వెంటనే ధర్మదేవత అన్నపూర్ణాదేవి దేవాలయానికి వెళ్లి అట్లాంటి పూజ చేయటానికి అడ్డుపర్చలేదు.

నా జీవితపు శుభోదయం—అట్లా సంపూర్ణ తృప్తిలో గడిచింది. మా మనస్సుల్ని ఆ పవిత్ర గంగా జలంతో, స్వామి దర్శనంతో కడిగివేసికొని విముక్తిమీద నమ్మకాన్ని కుదుర్చుకున్నాము. కాని నా మనస్సు ఒకందుకు చివుక్కుమన్నది. మమ్మల్ని అన్ని కష్టనష్టాల కోర్చి అక్కడకు చేరిన అతను పూజ చేయలేదు. సామీప్యాన్ని నిందించాలా?

అక్కడవున్న రోజులలో మత ప్రాముఖ్యత గల ప్రతి ప్రదేశమూ చూశాము. నిత్యమూ గంగానదిలో మునిగేవాళ్లం. ఎన్నోసార్లు విశ్వనాథుని దర్శించాము. సకల ఆచరణలూ యథావిధిగా జరిపాము. ఊళ్లోవాళ్లు జరపమన్న చర్యలన్నిటినీ సక్రమంగా జరిపాము. వీటి అన్నిటికీ అతని సహాయం మరువలేము. ఇంటి దగ్గర ఆమె వంటనుకూడా తరతరాలకూ మర్చిపోలేము. పళ్ళులేని మా నోళ్లకు సరిపడ్డ రుచులతో, అత్యంత

శ్రద్ధతో, తియ్యటి మాటలతో మమ్మల్ని ఆదరించిన వాళ్లకు ఎట్లా కృతజ్ఞత చెప్పటం?

మమ్మల్ని ఆనందపరాకాష్టనందింపజేసిన దృశ్యమేమిటంటే- పసి పిల్లలులాగ ఆ దంపతులు మా మూటలను విప్పారు. బియ్యపు గింజల్ని చూపించటానికి ఎంతో సిగ్గుపడ్డాము మేము. కాని వాళ్ళు శ్రీ కృష్ణ భగవానుడు కుచేలుని అటుకులు తిన్నట్టుగా మేము తెచ్చిన బియ్యపు గింజల్ని తిన్నారు.

"ఇంత తియ్యటి బియ్యం ఇక్కడ మాకు దొరకవు" అంటూ అతను నోటినిండా మళ్ళీ బియ్యపు గింజలు పోసుకున్నాడు.

"నిజం" అన్నదామె.

ఒక రోజు విశ్వవిద్యాలయాన్ని చూశాం. అతను మమ్మల్ని వివిధములైన పెద్ద పెద్ద కాలేజీ భవనాలకూ, గ్రంథాలయానికీ తీసికెళ్లి వివరంగా చెబుతూ చూపించాడు. ఇంటికివస్తూ—తులసీదాసు 'రామ చరిత మానస' వ్రాసిన, ప్రదేశానికి తీసుకెళ్ళాడు. "ఈ రామాయణం వాల్మీకి రామాయణం కంటె ప్రసిద్ధి గాంచినది. సామాన్య మానవుని సొత్తు అది ఇక్కడ" అన్నాడు.

ఇంటికి చేరుకోనేముందు అగపడ్డ ఒక స్నాన ఘట్టాన్ని చూపించి—"ఇక్కడే హరిశ్చంద్ర మహారాజు బానిసగా జీవించినది. చూడండి ఎంతమంది మహానుభావులకు భారతమాత పుట్టినిల్లు అయింది. సారనాథ్‌కు వెళ్ళినప్పుడుకూడా అట్లానే నిట్టూర్పు విడిచాడు అతను. "బుద్ధుడు ఇంకా ఇక్కడ సజీవుడై వున్నాడు" అన్నాడు అక్కడి పురాతన వస్తు ప్రదర్శనశాలనూ, కట్టడాలనూ చూపిస్తూ. ఈ ప్రదేశాలంటే అతనికి ఎందుకు ఇంత ఉత్సాహమో నేను అర్థం చేసుకోలేక పోయాను. మేము వారం

రోజులున్నప్పటికీ, మేము రెప్పపాటులో గడిచి పోయినట్టుగా భావించాము. మేము ఇంటికి వెళ్లటాన్ని గురించి ప్రస్తావించాము. కానీ వాళ్ళు దీపావళి వరకూ ఉండమని బ్రతిమాలారు. కాని మాకు ఎక్కువ బ్రతిమాలింపు అక్కరలేక పోయింది. ఇట్లాంటి సహృదయులను, మమ్మల్ని స్వంత తాత, అమ్మమ్మల లాగ, భావించేవారిని మేము కూడా మనుమడూ, మనుమరాలుగా గుర్తించిన వాళ్లని ఎట్లా కాదనటం? మా నిష్ఫల జీవితానికి ఇక్కడ శాంతి లభించింది. స్వజనమైన మా పూరి ఇల్లు కూడా పిలవటంలేదు. అంచేత ఉండిపోయాము.

ఎట్లానైతేనేం—కాశీలో ఉండే ఆఖరిరోజు వొచ్చింది. విందు ఏర్పాటు చేయబడింది, బ్రహ్మాండమైంది. ఎన్నో బహుమానాలు! ఏమని చెప్పము? మేము వేలవంగా అభ్యంతరం తెలిపాము గానీ, ఆ కొత్త చీరెలూ, ధోవతులూ మా సామానులతో పాటు మూట కట్టుతుంటే కాదనలేక పోయాము. వాళ్లిద్దరూ మాతోపాటు స్టేషనుకు బయలుదేరారు. స్టేషనుకు వెళ్లే దారిలో "మీ అన్నను గురించి నేను మీకు చెప్పినట్లే, మీ గురించి చెప్పటానికి ఎన్నో విషయాలు ఉన్నాయి నాకు. అతనికి మీ ఇద్దరూ బొత్తిగా కొత్తగా అగపడుతున్నారు."

"అవును. అంతా చెప్పండి. మమ్మల్ని దగ్గరకు చేర్చండి" అన్నాడు అతను నవ్వుతూ. ఆ నవ్వులో తన నవ్వునికూడా కలిపిందామె.

బండి స్టేషన్ను వొదిలిపెట్టేటప్పుడు నా గొంతు గాద్గదికమైంది. మా ఆవిడ కళ్ల నీళ్ళు తుడుచుకుంటూంది. "గుడ్ బై తాతా...! అమ్మమ్మా!" అని పిలుస్తూ చేతులు ఆడించారు. మేము తలలు ఎత్తి నీళ్ళు నిండిన కళ్లతో కనిపించినంత వరకూ

ఆ యువతీ యువకుల ముఖాలకేసి చూశాము.

*　　　*　　　*

బదన్‌వాలీ స్టేషనులో ఆ ట్రైనునుంచి దిగింది మేమిద్దరమే.

"మీరు మళ్ళీ సురక్షితంగా వచ్చారన్నమాట. అక్కడ ఏమీ అష్టకష్టాలు పడలేదు కదా!" అంటూ స్టేషను మాస్టరు వచ్చాడు.

"కష్టాలా? ధర్మదేవుడులాంటి మీ తమ్ముడూ ధర్మదేవత లాంటి అతని భార్య ఉండగా కష్టాలా...?"

"మా తమ్ముడా!" ఆశ్చర్యంగా మా వంక చూశాడు.

"ఏం? మీరు వ్రాసిన ఉత్తరం సంగతి మర్చిపోయారా ఏమిటి?"

"ఉహు! కాని ఆ ఉత్తరం విప్పబడకుండానే ఈ అడ్రసు వారు ఇక్కడ లేరంటూ వొచ్చింది."

"ఆ! ఏమిటి?" ఆశ్చర్యపడాల్సిన వంతు నాదైంది.

"అవును, ఆ ఉత్తరం తిరిగి రావటంతో మీ గురించి ఆదుర్దా పడ నారంభించాను."

"మరి—అయితే వాళ్ళెవరు?" అన్నాను విస్మయంగా,

"ఎవరు" అన్నాడు స్టేషను మాస్టరు.

"అంత ఆత్మీయులుగా, ఆదరంగా, అత్యంత శ్రద్ధగా ఎవరు చూశారు."

"నిజం! ఎంతో ఆశ్చర్యంగా ఉంది. అద్భుతం కూడాను" అన్నాడు స్టేషను మాష్టరు.

కొంచెం నిశ్శబ్దత వాళ్ళమధ్య స్థానాన్ని ఏర్పరుచుకుంది.

"ఎవరైనా మా తమ్ముడు అక్కడ లేకపోవడం గమనించి సహృదయంగా మిమ్మల్ని ఆదరించారేమో" స్టేషను మాష్టరు వూహించాడు.

"నాకు తెలీదు" నాకు తల తిరిగినంత పనైంది.

"బహుశా వాళ్ళు కాశీ విశ్వనాథుడు, ఆయన భార్య అన్నపూర్ణ కావచ్చు" అన్నది మా ముసలిది అతి నెమ్మదిగా.

స్టేషను మాష్టరు బిగ్గరగా నవ్వాడు. కాని ఆవిడ వూహ సరియైనదనే నమ్మకం కలిగింది నాకు.

(ఒక ఆంగ్ల కథ ఆధారంగా)

(ఆంధ్రప్రభ)